# సన్మానం

రవీంద్రభారతిలో ఆ రాత్రి శుక్రదంతరావుకి సన్మానం జరుగుతోంది ఆయన ఆంధ్రరాష్ట్రానికి మినిస్టర్ ఫర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్.

ఆయన్ని సన్మానించేందుకు నడుం కట్టింది ఆల్ ఇండియా టైర్ మేన్యుఫాక్చరర్స్.

సరిగ్గా ఏడూ రెండు నిమిషాలకి కారు దిగాడు శుక్రదంతరావు. ఫెడరేషన్ చెయిర్మేన్ డబ్ల్యు. డబ్ల్యు డబ్ల్యు మంత్రిగారికి ఎదురెళ్ళి మెళ్ళో తెల్లగులాబీ పూలదండని వేశాడు. ఆయన సతీమణి శుక్రదంతరావు నుదట తిలకం దిద్దింది. మంగళ వాయిద్యాల ఘోష వినపడుతుండగా పండితులు వేదమంత్రాలు పఠిస్తుండగా, పరిచిన ఎర్రటి కార్పెట్ మీద శుక్రదంతరావు రవీంద్రభారతిలోకి దారితీసాడు.

ఆయన్ని స్టేజ్ మీదకి ఆహ్వానించారు. దాదాపు గంటసేపు ఆయన సన్మానోత్సవ కార్యక్రమం సాగింది ఆలిండియా సైకిల్ టైర్స్ మేన్యుఫేక్చరర్స్, కారు, స్కూటర్ మోపెడ్లు మొదలయిన పెట్రోల్‌తో నడిచే వాహనాలు టెగ్ ఉత్పత్తి కంపెనీలు, ట్విన్ సిటీస్ అసోసియేషన్ ఆఫ్ మోటారు మెకానిక్స్, సైకిల్ రిపేరర్స్, భాగ్యనగర్‌లోని లాండ్రి షాపుల అసోసియేషన్ మొదలయిన అనేక సంస్థలు గులాబి దండలను రూపాయినోట్ల దండలని మంత్రిగారికి పంపారు

శుక్రదంతరావుని, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడుతూ అనేకమంది మాట్లాడారు. ఆయనకు ఆలస్యముగానైనా సన్మానం జరుగుతున్నందుకు హర్షం వ్యక్తంచేసారు.

తర్వాత మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైద్రాబాద్ స్పెషల్ ఆఫీసర్‌కి, ఆ కార్యాలయంలోని ఇతర ముఖ్య ఉద్యోగులకు ప్రత్యేకంగా

వెండితో చేసి, బంగారపు రేకు తొడిగిన విగ్రహాలను బహూకరించారు

సన్మానం అయ్యాక ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టైర్ మేన్యుఫ్యాక్చరర్స్ చెయిర్ మెన్ డబ్ల్యు-డబ్ల్యు-డబ్ల్యు మైక్ ముందు నిలబడి గొంతు సర్దుకుని చెప్పసాగాడు.

"లేడీస్ అండ్ జంటిల్ మన్ ఈ సంవత్సరం భారతదేశంలోని టైర అమ్మకం ఏమాత్రం ఆశాజనకంగా లేదు వ్యాపారము పంతొమ్మిది శాతం తగ్గింది. ఇది మిగతా రాష్ట్రాలలోనే కాని ఆంధ్రప్రదేశ్ లో అమ్మకాలు ఇతర రాష్ట్రాలలోలా తగ్గేబదులు, ఏభై శాతంపైనే అధికమవటంతో దేశంలోని ఇతర ప్రాంతాలలో తగ్గడంవల్ల కలిగిన నష్టము భర్తీ అయింది

ఆంధ్రరాష్ట్రంలోని సేల్స్ మేన్ యొక్క సేల్స్ మేన్ షిప్ అమ్మకాలు పెరగడానికి కారణం కాదని తేలింది. దీనిమీద ఓ కమిటీని వేసి విచారిస్తే ఆంధ్రుల అందాల రాజధానిలో ఇంకా ఇతర ముఖ్య పట్నాల లోని రోడ్లు అత్యంత అధ్వానస్థితిలో వుండటంవల్ల టైర్ల నిర్ణీత జీవితం తగ్గి అమ్మకాలు పెరిగాయని తేలింది, నిర్మించిన మర్నాడే వర్షానికి కొట్టుకు పోయేలా గుంటలు రోడ్లు వేయగలిగే కాంట్రాక్టర్లని నియమించిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రిగార్ని, ఆయన సెక్రటరీని తదితర వుద్యోగులను సన్మానించి మా హర్షాన్ని వ్యక్తం చేయదలచు కోవడంవల్ల ఈ సన్మానం జరిగింది

"తమ విలువయిన కాలాన్ని వెచ్చించి ఆహ్వానించగానే వచ్చిన మంత్రి శుక్రదంతరావుకి మీకు మా హృదయ పూర్వక కృతజ్ఞతలు."